


# ఎదురీత

మా. ఋషికుల్యాదేవి

సరే; నాకు పెండ్లక్కర లేదన్నాను. అమ్మ విసిగి ఊరుకుంది. అత్తయ్యా, తన కిదొక పరాభవంగా తీసుకొని, ఒక్కగా నొక్క అన్నగారైన నాన్న గారితో సంబంధమే త్రెంపుకొంది. నాన్న ఎంతో బాధపడ్డా, నామాట కాదనలేక, చెల్లెలినే వదులు కున్నారు. బావ మాత్రం తన కిదొక పరాభవం అని అనుకోలేదు. ఈ పెండ్లి కానంత మాత్రాన మేనమామ, మేనత్తల చుట్టరికం ఎలా పోతుం

దనేవాడు.....ఒక రోజు స్వయంగా తనే....... 'చదువైనాక మన పెండ్లికి నీ అభ్యంతరంలేదా?' అని అడిగాడు. అసలు నేను పెండ్లే చేసుకోనని మొండిగా సమాధానం ఇచ్చాను. నాకోసం పై సంబంధా లెన్నో చూశారు. అహంభావంతో అన్నింటికీ తలొక పేరూ పెట్టాను.

'అడ్డాలలోనే బిడ్డలు గాని గడ్డా లొచ్చాక బిడ్డలా? అందుకే ఆడపిల్ల కంత చదు వెందుకని ఏడ్చాను. నా మాట విన్నారు గాదు. ఇంక చెప్పండి, దాని కెలా చెబుతారో?' అని అమ్మ, నాన్నను సాధించింది.

'చెప్పడాని కేముంది ? ఎమ్. ఏ. చదవనీ' అన్నారు నాన్న.

'అవును. మీ అండ చూసుకొనే దానికా ధైర్యం' అన్నారు మామయ్యలు.

ఆ అల్లకల్లోలంనుండి బయటపడి వైజాగ్ హాస్టలు చేరుకున్నాను. అన్నయ్య, బావ, వైజాగ్‌లోనే మెడికల్ హాస్టలులో ఉన్నారు. నా సాహసానికి అన్నయ్య అభినందించాడు. జీవితపు విలువలను గురించి బావ హెచ్చరించాడు.

ఏదో సాధించాననే భావంతో చాలా గర్వంగా ఉండేదాన్ని. అందరితోనూ చాలా చనువుగా తిరగడంవల్ల, కొద్ది రోజుల్లోనే ఎంతోమందితో స్నేహమైంది. నా స్నేహితులలో చాలామంది మొగపిల్లలే. కాని, నా స్నేహితులే తమ చెల్లెళ్ళను నాతో ఎక్కువ స్నేహం చెయ్యవద్దని హెచ్చరించేవారని, తర్వాత తెలిసింది. రాను రాను నా ప్రవర్తన అన్నయ్యకూ, బావకూ అవమానకరంగా ఉండేది. అయినా, నన్నేమీ అనలేకపోయేవారు, నా స్వభావానికి జడిసి. ఏ హోటలులోనో నలుగు రబ్బాయిలతో కలిసి కూర్చుని కాఫీ త్రాగుతున్న నన్ను చూసి, తల వంచుకొని వెళ్ళిపోయేవారు. ఒక రోజు అన్నయ్య సాహసించి, అంత మరీ విచ్చలవిడిగా ఉంటే నలుగురూ నవ్వుతున్నారని హెచ్చరించాడు. 'ఎందుకూ నవ్వడం? కూడని పని నేనేం చేశానని? స్నేహితులతో కాఫీ త్రాగడం తప్పా? మీ స్నేహితులంతా కలిసి హోటలు కెళ్ళరూ?' అని సమాధానమిచ్చాను.

'అవునమ్మా. నవ్వేది మేము గాదు; నువ్వు తిరుగుతున్న నీతోటి లోకమే' అన్నాడు. నాకేం అర్థం కాలేదు. 'నా విషయం నాది' అన్నాను కోపంగా.

ఎంతో చొరవగా కాలేజీలోని ప్రతి విషయంలోనూ పాల్గొనేదాన్ని. అందుమూలంగా అనేక బహుమతు లందుకొనేదాన్ని. నా తెలివి తేటలకూ, ధైర్యానికీ ప్రొఫెసర్లంతా నన్ను మెచ్చుకొనేవారు.

ఇలా ఉండగా నా కెంతో ప్రాణ స్నేహితు లనుకొంటున్న కృష్ణమూర్తి, రాజు వాళ్ళ సంభాషణ లేడీస్ రూంలో ఉన్న నా చెవుల బడింది.

'ప్రొఫెసర్ల దృష్టిలో కెళ్ళిపోయిందిరా. ఇంక మన కందదు' అంటున్నాడు రాజు.

'అవును. మొన్న ఇంగ్లీషు ప్రొఫెసరుతో గంటసేపు మాట్లాడేసింది. ఏం నవ్వు లనుకున్నావు!!' అన్నాడు మూర్తి.

'పోనీలే. ఆయన బ్రహ్మచారేగా?' అంటున్నాడు శర్మ.

'ఒరేయ్, పాపం! శారద మనందరితోనూ నిష్కల్మషంగా స్నేహం చేస్తోంది. ఆమె వెనకాల ఆమెను గూర్చి ఈ విధంగా మాట్లాడుకోవడానికి సిగ్గు పడాలి. ఆమె స్వేచ్ఛ నర్థం చేసుకోలేనివాళ్ళసలు ఆమెతో స్నేహం ఎందుకుచేశారు?' అని రావు బాధ పడ్డాడు.

'ఆవిడ నర్థం చేసుకొన్నవాడివి బయలుదేరావురా.....మహా చెప్పొచ్చావు. ఏదీ, నీ చెల్లిని ఇలా తిరగమను చూద్దాం' అన్నాడు రాజు, వెటకారంగా.

'కలిసి వెళ్ళడంలో తప్పులేదు. కల్మషమైన మనస్సు లుండడమే తప్పు' అంటూ రావు ముందుకు వెళ్ళిపోయాడు. తక్కినవారంతా విరగబడి నవ్వారు. నా తల తిరిగిపోయింది. ఇంక అక్కడుండలేక, గది కొచ్చేశాను. ఎంత చులకనైపోయాను! ఎంత ధైర్యంగా మాట్లాడుతున్నారు! అతి చనువుగా వారితో స్నేహం చేసినందుకు నన్నాక నీతిలేని స్త్రీగా జమకట్టా రన్నమాట! ఎంత మోసపోయాను! విజ్ఞానవంతులైన వాళ్ళలో గూడా ఇంటువంటి నీచ భావం ఉంటుందనుకోలేదు.

'ప్రొఫెసర్ల దృష్టిలో పడింది; ఇంక మనకి దక్కదు.' ఎంత నీచంగా మాట్లాడారు! ఇదేనా నాగరకత? ఇందుకేనా ఇంత చదువు? తల అనేక ఆలోచనలతో బరువెక్కిపోయింది. సాయంత్రం ఆరు గంటలకల్లా తయారయ్యాను, నా ప్రాణ

# ఉదయరాగం

సి. సుబ్బారావు

ఈ ఉదయం మహోదయం
చేస్తున్నది దిగ్విజయం

పిసినిగొట్టు ప్రాణిజగతి పిసరైనా మిగులుంచక
విసిరేసిన విస్తరిపై కెగబడి తెగనాకుతూంది:

ఈ ఉదయం దాహామయం
చేస్తున్నది దిగ్విజయం

మ్రింగి భువన భాండాలను సంగనాచివలె నాలుక
రంగు తుడుచుకున్నది నిరపరాధి నంటున్నది:

ఈ ఉదయం మృత్యుభయం
చేస్తున్నది దిగ్విజయం

పడమటేన్ను కబళించిన వెడలివచ్చి తూర్పునందు
పొడసూపిన వెలగపండు గుజ్జుకరుగలేదన్నది :

ఈ ఉదయం జీవజయం
చేస్తున్నది దిగ్విజయం

వలపు కీళ్ళు సడలించిన చెలువుని చెవిలోని మాట
తలచిన నవవధువు మదిని మెదిలే అనురాగ రేఖ

ఈ ఉదయం ప్రేమమయం
చేస్తున్నది దిగ్విజయం.

స్నేహితులు. 'మంచి సినిమా ఉంది. వెడదామా?' అన్నాడు రాజు. నా ఒళ్ళు మండిపోయింది. కాని, ఏమనను? తల పోటుగా ఉందని, రాలేనని చెప్పాను. తమలో తామే నవ్వుకుంటూ వెళ్ళిపోయారు.

'నే చెప్పలేదురా,ఇక మనకందదనీ?' అంటున్న రాజు మాటలు, దూరంనుంచి వినిపించాయి.

తర్వాత నా దగ్గరనుండి తీసుకొన్న పుస్తకం తిరిగి ఇచ్చెయ్యడానికి రావు వచ్చాడు. మూర్తి, రాజు—'శారదంటే నీ కెందు కంత ప్రత్యేకాభిమానం?' అన్న మాటలు గుర్తు కొచ్చి, అయినా చూద్దామని, 'సినిమాకి వెడదామా?' అని అడిగాను. 'రాజు, మూర్తి వస్తున్నారా?' అని అడిగాడు. లేదన్నాను. 'క్షమించు శారదా. నేను రాలేను' అన్నాడు. 'ఏం?' అన్నాను. 'ఏమీలేదు.

## ఎదురీత

అనవసరంగా నీకు అపవాదులు రావడం నా కిష్టం లేదు' అన్నాడు.

కాలేజీ ఎలక్షన్లు. ఆడపిల్లలకు ప్రతినిధిగా నిలబడ్డాను. నాకు పోటీగా మనోరమ నిలబడింది. మనోరమ ఒక్క మీటింగుకీ రాదు. దేంట్లోనూ ఉత్సాహంగా పాల్గొనదు. తప్పక విజయం నాదే ననుకున్నాను. కాని, పూర్తిగా ఓడిపోయాను. అంతా మనోరమకే ఓట్లేశారు. నా విలువ తెలుసుకున్నాను. జీవితంలో మొదటిసారిగా ఓడిపోయాను. నాలో చైతన్యం తగ్గింది. ఉత్సాహం నశించింది. పాత స్నేహితులంతా మమ్మల్ని మరిచి




పోయావా? అనేవారు. అంతా ఎగతాళిగా మాట్లాడేవారు. ఎప్పుడూ నా స్నేహితులు గాని వాళ్ళే నాతో మర్యాదగా మాట్లాడేవారు. ఈ మొగవాళ్ళంతా ఇష్టం వచ్చినట్లు తిరుగుతూ, ఇష్టం వచ్చినవాళ్ళతో స్నేహం చేస్తూ ఉంటారు గదా? ఆడపిల్లల్నంత గోల ఎందుకు చేస్తారో! రాజుతో మాట్లాడితే, మూర్తికి కోపం. మూర్తితో షికారు కెడితే, శర్మకు మంట. ఏమిటిదంతా? వాళ్ళల్లో వాళ్ళెవళ్ళతో తిరిగినా, వాళ్ళకు కోపాలు రావేం? ఎంత చదువుకొన్నా ఈ స్త్రీ పురుషభేదం ఎప్పటికీ పోదని తెలుసుకొన్నాను. కనువిప్పు గలిగింది.

నా మొదటి సంవత్సరం పూర్తయ్యేసరికి అన్నయ్య, బావల కోర్సు పూర్తయింది. నేను వైజాగ్ వచ్చేటప్పుడు వాళ్ళు ఉన్నారని ధైర్యంగా రాలేదు గాని, ఇప్పుడు ఒక ఏడాది గడిచాక, వాళ్ళు వెళ్ళిపోతారంటే ఎంతో భయం వేసింది.

'ఈ సంవత్సరం అయ్యాక, ఏం చేస్తావు శారదా?' అన్నాడు బావ. 'రీసెర్చి' అన్నాను. 'తర్వాత?' అన్నాడు. 'ఉద్యోగం' అన్నాను.


'ఉద్యోగం నీ కవసరమేమో?' అన్నాడు, ఆశగా నా వైపు చూస్తూ.

'నీ కెంత అవసరమో నాకూ అంతే అవసరం' అన్నాను అతి నిర్లక్ష్యంగా.

అన్నయ్య, బావ వెళ్ళిపోయారు.....

మోహన్, రీసెర్చి చేస్తూ ఉండేవాడు. ఎప్పుడూ ఎవ్వరితోనూ సంబంధం లేనట్లుండేవాడు. నే నెప్పుడు బీచి కెళ్ళినా, ఒంటరిగా కూర్చుని, ఏదో ఆలోచిస్తూ ఉండేవాడు. ఒక రోజు నేనే వెళ్ళి పరిచయం చేసుకొన్నాను. 'అవును. తెలుసును' అన్నా డతనతి సామాన్యంగా. నా కాశ్చర్యం వేసింది. తెలిసి గూడా ఇన్నాళ్ళూ మాట్లాడలేదు. అతనంటే ఎందుకో నాకు గౌరవం ఏర్పడింది. రోజూ సాయంకాలం బీచిలో కలుసుకొనేవాళ్ళము. జీవితాన్ని గూర్చి, లోకపు తీరును గూర్చి ఎన్నో విషయాలు ఎంతో చక్కగా మాట్లాడేవాడు. అతని భావాలు నన్నాకర్షించాయి. మా స్నేహం చాలా వృద్ధిపొందింది. ఈ స్నేహాన్నాధారంగా తీసుకొన్న కట్టు కథలు కావలసినన్ని అల్లారు, కాలేజీవాళ్ళు. కాని, నా కవి కష్టంగా తోచలేదు. ఆ కథలే నిజ మవ్వాలనుకొన్నాను. నా సంగతి మనవాళ్ళదాకా తెలిసింది. నిజా నిజాల కోసం నాన్న నాకు రాస్తే, నా మనస్సు ఆయనకు విప్పి వ్రాశాను. బావ నామీద ఆశ వదులుకుని, తల్లి తండ్రులు కుదిర్చిన పిల్లను పెండ్లి చేసుకొన్నాడు.

ఈ సంగతంతా మోహన్‌తో చెప్పాను. చెప్పక తప్పింది కాదు. అలానే అడుగుతా డనుకున్నాను. ఇంత గోల అవుతున్నా, అతనికి చీమకుట్టినట్లు లేదు. నా నోటిమీదుగా సంగతంతా విన్న అతను అదిరిపడ్డాడు. మొహాన కత్తి వేటుకి నెత్తురు చుక్కలేదు. 'శారదా, ఏమిటి? కథ ఇంతదాకా వచ్చిందా? మన స్నేహాని కిదే సారాంశమా? నీ



సెనేట్ భవనం (మద్రాసు) ఫోటో—ఆ. రామప్రసాదరావు (మద్రాసు-4)

కటువంటి ఉద్దేశ్యం కలిగిస్తే క్షమించు శారదా? నువ్వు ఆ విధంగా భావిస్తున్నావని గ్రహించలేకపోయాను' అంటూ తల దించుకొన్నాడు.

'లేదు, మోహన్. మీరు నా కెప్పుడూ అలాంటి అవకాశం ఇయ్యలేదు. కాని, నేనే పొరబడ్డాను. నలుగురూ కల్పించిన కథలు నాన్నకుచేరి, నాన్న నాకు వ్రాస్తే, మిమ్మల్ని గూర్చి వ్రాశాను. నా ఇష్టాన్ని తెలిపాను. ముందు మీ మనస్సు గ్రహించకుండా వ్రాసినందుకు నన్ను మీరే క్షమించాలి' అన్నా నెంతో బాధగా.

తన డైరీలోని ఫోటోనుతీసి నా కిచ్చాడు, మోహన్. అందాలరాణి బంగారు బొమ్మలా ఉంది ఆ అమ్మాయి. క్రింద 'త్రివేణి. ప్రేమతో —బావకు' అని వ్రాసివుంది.

తిరిగి అది అతని డైరీలో పెట్టేశాను.

'శారదా, ఆమె నా ప్రాణం. ఈ రీసెర్చి ఎప్పుడైపోతుందా? ఆమెను నాదానిగా చేసుకొని ఆనందంగా గడపాలని ఎదురుచూస్తున్నాను. బీచిలో ఒంటరిగా కూర్చుని, ఆలోచించే దామెను గూర్చే. నా వేణుకు నేను ద్రోహం చెయ్యలేను, శారదా. క్షమించు' అన్నాడు. నా మనస్సులో బావ మెదిలాడు. పాపం! బావ కూడా నాకోసం ఇంతగా పరితపించాడు. కాని, ప్రతిఫలం పొందలేకపోయాడు. మోహన్ అదృష్టవంతుడు. కాని, నాకు మాత్రం జీవితంలో ఇది రెండవ ఓటమి.

చదువైంది. రీసెర్చి అయింది. ఇంటికి వచ్చాను. బావకూ, అన్నయ్యకూ పెండ్లిండ్లయి పోయాయి. నా కిష్టం లేకపోయినా నాన్నగారు సంబంధాలు చూస్తూంటే వద్దని గట్టిగా చెప్పలేకపోయాను. కాని, డాక్టరేటు పొందిన నాకు సంబంధాలు వెతకడ మంటే సాధ్యమా? ఒక • శేఖ నాకన్న తక్కువ చదువు కలిగినవాళ్ళను నేను ఒప్పుకొన్నా వాళ్ళు ఒప్పుకొనేవారు గాదు. నాకు తగిన ఏ పెద్ద ఆఫీసరునో చూస్తే వాళ్ళు నేను ఉద్యోగం చెయ్యడానికి వీలులేదనేవారు. ఇలా మరికొంతకాలం గడిచింది. ఉద్యోగంలో చేరాను. అంతదాకా రాఘవరావుగారి అమ్మాయి రీసెర్చి చేస్తోంది అని గొప్పగా చెప్పుకొనేవాళ్ళే—'అయ్యో, పాపం! ఉద్యోగం చేస్తుందిట!' అనేవారు. 'ఏం చేస్తుంది? పెండ్లి కావడం లేదు' అనేవారు. 'బెండకాయ ముదిరినా బ్రహ్మచారి ముదిరినా అందుకే పనికి రాదంటారు' అని సామెతలు చెప్పేవారు.

ఆఖరికి నాన్న ఎలాగో ఒక సంబంధం కుదిర్చారు. ఆయ నేదో కంపెనీలో పెద్ద ఉద్యోగంలో ఉన్నాడు. నేను ఉద్యోగం చెయ్యడానికి వీలులేదన్నాడు. అమ్మ, నాన్నల బాధ చూడలేక, అందుకూ ఒప్పుకొన్నాను. కాని, తీరా అంతా స్థిరం అయ్యాక, అంత చదువుకున్న పిల్ల తన కక్కరలేదని రాశాడు. అసలు సంగతి ఆయనకు ఎవరో నాపై లేని పోనివన్నీ కల్పించి రాసి, హెచ్చరించారట. అంతే. నా పెండ్లి ఆగిపోయింది. ఇంక పెండ్లి విషయమే ఎవ్వరూ ఎత్తలేదు. కాని, బెంగతో అమ్మ మంచాన బడింది. ఆ ఏడే నువ్వు పుట్టావు. నిన్ను నా చేతుల్లో పెట్టి, అమ్మ కళ్ళు మూసింది. ఇక ఆ ఊళ్ళో ఉండలేకపోయాను. తెలిసినవాళ్ళంతా—

'ఏం, అమ్మా, ఉద్యోగం చేస్తున్నావా?' అనేవారు. వారి మాటల్లో ఎంతో హేళన నిండి ఉండేది. 'ఇంకేం చేస్తావులే!' అన్నట్లు ధ్వనించేవి వారి మాటలు. 'ఏం? నేనేం పోగొట్టుకున్నాను? ఇంతకన్న మంచి పదవి, ఇప్పుడు నా కొచ్చిన లోటేమిటి?' అని సరిపెట్టుకొనేదాన్ని. అయినా, నాకే ఏదో వెలితిగా కన్పించేది. నువ్వు పుట్టినప్పుడు 'అయ్యో.....ఆడపిల్లా?' అన్నారు నాన్నగారు. ఆ మాటలు నన్నెంతో బాధించాయి. పైకి నన్నేమీ అనకపోయినా, నాన్నగారు నావల్ల ఎంత బాధ పడుతున్నారో తెలుసుకున్నాను. తర్వాత, నాన్నగారు ఎంత ప్రయత్నించినా, నాకు ఏ సంబంధం కుదరలేదు. ఆ ఊరు వదిలి, ఈ ఊరు కాలేజీకి వచ్చేశాను. నా పెండ్లి సమస్యతోనే నాన్నగారు క్రుంగి, కృశించి ఆఖరికి గుండె జబ్బుతో ప్రాణాలొదిరేశారు. ఇంక నీ బాధ్యత పూర్తిగా నాపై బడింది. నా విషయంలోనే నాన్నకు, అన్నయ్యకు విరోధం వచ్చి అన్నయ్య ఎప్పుడో దూరమైపోయాడు. నిన్ను నా చెల్లెలంటే, పైకి ఏమీ అనకపోయినా అందరూ అనుమానించేవారు.

'కూతురే అయివుంటుంది. అచ్చం అదే పోలిక. లేకపోతే ఇన్నాళ్ళా పెండ్లి కాకుండా వుందీ!' అని చెప్పుకొనేవారు. అంతే. అలా అలా పదేళ్ళు దొర్లిపోయాయి. నీ భవిష్యత్తు మదిద్దే భారం నాపైన ఉంది. నా జీవితం ఒక మోడులా గడిచిపోయింది. జీవితమంతా ఖర్చుచేసి నేర్చుకొన్న పాఠంతో నీ జీవితం సరిదిద్దాలి. చుట్టాలంతా వెలేసినట్లు మనల్ని వదిలేశారు. అన్నయ్య గూడా ఏమీ కల్పించుకోడు. బావ మాత్రం తన తమ్ముడికి నిన్నెలాగైనా చెయ్యాలని పరితపిస్తున్నాడు. జీవితం మనం అనుకున్నంత సులభమైంది కాదు ప్రభా. అసలు మన జీవితంలో జరిగేవాటికి మనతో ప్రమేయమే ఉండదు. చదువుకొని ఉద్యోగంచేసి, నేను సాధిద్దా మనుకొన్న దేమిటి? సాధించి, సుఖపడిన దేమిటి? నే నిప్పు డీ కాలేజీకి ప్రిన్సిపాలును. కావలసినంత హోదా, ధనం, పలుకుబడి ఉన్నాయి. కాని, జీవితానికి శాంతే లేదు. నాలోని కోర్కెలన్నీ బలవంతంగా అణిగిపోయాయి. అమ్మ ప్రసాదించిన నువ్వు నా కిన్ని రోజులూ ఒక ఆటవస్తువుగా ఉన్నావు. రేపు నువ్వూ వెళ్ళిపోతావు. ఇంక నా జీవిత లక్ష్యం ఏమిటి? ఎవరికోసం ఈ సంపాదన? దేనికోసం నా నిరీక్షణ? అంతా శూన్యం. ఈ మహా జీవిత సాగరంలో నాది ఎదురీత'' అని విచార భారంతో కళ్ళు మూసుకుంది శారద.

కొన్ని నిమిషాలు అలా నిశ్శబ్దంగా గడిచాయి. ఏదో తీవ్రంగా ఆలోచించుకొంది ప్రభ. అక్క వైపు ఎంతో జాలిగా ప్రేమగా చూసి, ఆమెను తన రెండు చేతులతోనూ చుట్టివేసింది.

''అక్కా నేనున్నాను కాదూ? నీకు, చుక్కానిని. నీ కెందుకు విచారం'' అంది.

''అవునమ్మా. నువ్వు చుక్కానివి కాగలిగితే, నాకు సంతోషమే. కాని, ఈ అక్క ఆదర్శంతో నీవూ ఎదురీత మొదలెడితే మనకి గమ్యం శూన్యం'' అంది శారద.

'టెలిగ్రాం' అన్న కేక విని, బయటి కెళ్ళి టెలిగ్రాం తెచ్చింది ప్రభ. ప్రభాకర్ వద్దనుండి అభినందనలు. ఆనందంతో అక్క కందించింది. అక్క కథ విన్న ప్రభ కా టెలిగ్రాం అత్యంత ఆనందదాయకమైంది.

''ఏమంటావు?'' అంది శారద.

''అత్తయ్యా వాళ్ళనూ రమ్మని రాయి'' అని సిగ్గుతో తల వంచుకొంది ప్రభ.

అక్కా చెల్లెళ్ళిద్దరూ తండ్రి పటానికి నమస్కరించి తృప్తిగా నవ్వుకున్నారు. ★